# ప్రాణాధికం

కే. కుటుంబరావుగారు

(భారతమహిళాసతీత్వమును ప్రదర్శించు చక్కని చిన్నకథ)

రంగారావూ, ఆతని బావమరిదీ ఇంటిముందు బయలులో రెండుకుర్చీలమీద కూర్చున్నారు. రంగారావు కనుబొమలు ముడిచి దీర్ఘమైన ఆలోచనలోపడ్డాడు. రామమూర్తి లేచి పచారుచెయ్యటం మొదలుపెట్టేడు. రెండునిమిషాలు గడిచింది. రామమూర్తి అకస్మాత్తుగా రంగారావుముందాగి "మాచెల్లెలు అంత ఆధైర్యపడ్డానికి కారణంలేదు" అన్నాడు.

రంగారావు దీనంగా చిరునవ్వునవ్వేడు.

"ఆమాట నీచెల్లెలికి నచ్చచెప్పు. చూతాం! ఎవరోగుండెజబ్బుతో పోయినారట. తానుకూడా పోవలసివస్తుందని ఒకటే బెంగ. పైగా బాధ ఒక్కరవ్వ భరించలేదు. సాధారణంగా నొప్పి భోజనానంతరం కాని, కొంచెంశ్రమపడితే కాని వస్తుంది. ఒకరోజున ఎంతగోలచేసిందనుకున్నావు? నేను చాలా భయపడ్డాను. చివరకు నవ్వి ఎక్కువబాధలేదన్నది."

రామమూర్తి తలఊపేడు. "నేనెరుగుదును. దానికి మొండితనంకూడా జాస్తి."

"జాస్తీ గీస్తీ ఎరగనే! డాక్టరును పిలుస్తానన్నాను. డాక్టరు గుండెపరీక్షించాలంటాడని వద్దన్నది. ఏదైనా మందిస్తే తాగుతానంటుంది. కాని నాకు నమ్మకంలేదుమూ!"

"తాగదు. నేనెరుగుదును."

"ఇంకొకడాక్టరు ఇష్టంలేకపోతే నిన్నుపిలుస్తానన్నాను."

"నన్నుచూస్తే దానికి గురిలేదు. నే నొకవేళ మందిచ్చినా దానికి పంటపట్టదు."

"ఆమాటే అన్నది. నాకేమీ తోచటంలేదు."

"కాకపోయినా నిన్నుచూస్తే దానికి బొత్తిగాభయంలేదు, బావా! ఎంతఆపేక్షఅయినా అంతచనువు పనికిరాదు."

రంగారావు మళ్లీ నవ్వేడు. "చనువిచ్చినందుకు నాకు పశ్చాత్తాపంలేదు. ఇప్పుడు పశ్చాత్తాపపడీ కార్యంలేదు. దీనికేదో ఉపాయం ఉండాలి. నేనెరిగినంతవరకూ అది మందుపుచ్చుకునేమార్గం కనిపించలేదు. నానాటికి రోగం ఎక్కువవుతూంది."

రామమూర్తి కొంచెం ఆలోచించేడు.

"పోనీ శకుంతలకు ఫలానిడాక్టరు చాలగట్టివాడని అభిప్రాయంఉందా?"

"లేకేం? శేషాచలపతి చాలాకేసులు నయంచేశాడు గుండెజబ్బువి. అది దానికి తెలుసును."

రామమూర్తి సంతోషంతో "ఇంకేం?" అన్నాడు.

* * * *

ఆరాత్రి భోజనాలసమయంలో రంగారావు భార్యజబ్బుసంగతి తెచ్చేడు.

"అన్నట్టు ఈ ఊళ్లో గట్టిడాక్టరుండాలే. శేషాచలపతిగారని. ఎరుగుదువా? బావా?"

"అవునురా?" అన్నాడు రంగారావు అనుమానిస్తూ.

"ఆయన కొన్నికేసులు నయంచేశాడు. కాని ఆయన గుండె పరీక్షించకుండా మందివ్వడు" అన్నది శకుంతల.

"అవును. పరీక్షించనీ. పరీక్షించకుండా ఏడాక్టరూ ఇవ్వడు!" అన్నాడు రామమూర్తి.

"నాకక్కరలేదు!" అన్నది శకుంతల తుటారిస్తూ.

"అదేమేవు?" అన్నాడు అన్నగారు ఆశ్చర్యంలో.

"నాకుపరీక్షలూవద్దూ పాసలూవద్దూ."

"వద్దకపోతే జబ్బేలా నయమవుతుంది?"

"పోనీలే! నయంకాకపోతే భయంలేదు."

"బాధపడగలవా?"

"ఇప్పుడు పడ్డంలేదూ?"

ఆమెకు సమాధానం చెప్పడం సులభంకాదు.

* * * *

ఆరాత్రి పడుకోబోతూ రంగారావు భార్యనుపిలిచేడు. శకుంతలవచ్చి అతనిపక్క నేకూర్చుంది. రంగారావు భార్యతల చేత్తో నిమురుతూ "నాకెంత కష్టంగాఉందో తెలుసునా? పిల్లా!" అన్నాడు.

"ఎందుకు?" అన్నదిభార్య ఆదుర్దాతో.

"నీకుప్రాణభయంలేకపోతేమాత్రం నాకోసరం మందుతాగకూడదా?"

శకుంతల మాట్లాడకుండా తలవంచుకుంది.

"పోనీ నీకిష్టంలేకపోతే" అన్నాడు రంగారావు నిట్టూర్పువిడిచి.

శకుంతల చిరునవ్వుతో తలయెత్తి "నేను మందుతాగుతాను. డాక్టరును నాచెయ్యిఅయినా తాక నివ్వను. ఈ ఒక్కవిషయంలోనన్ను క్షమించండి" అన్నది.

"ఒకవేళ జబ్బు అపాయకరంగా వచ్చేటట్టయితే నన్నువిడిచిపెట్టిపోతావా?"

"నా కాభయంలేదు. నేనుచచ్చిపోయినా మీదగ్గిరే ఉంటాను!"

"మరి నా విషయం? నిన్నువదిలి నేనుండగలనా?"

శకుంతల సమాధానంచెప్పకుండా రంగారావును చప్పున ముద్దుపెట్టుకొని వెళ్లిపోయింది. రంగారావు ఒక్కనిట్టూర్పువిడిచి ఊరుకున్నాడు. ఏమి జరగాలిసిఉందో?

* * * *

మర్నాడుఉదయం రామమూర్తి శేషాచలపతిగారితో మాట్లాడివస్తానని వెళ్లేడు. రంగారావుకు రామమూర్తివల్ల లాభంలేదని తోచింది. పదిగంటలకు రామమూర్తి సీసాతో మందుతెచ్చేడు.

"శకుంతలా! శేషాచలపతిగారు మందిచ్చేరు. దీనితోనే ఆయన చాలాకేసులు నయంచేశారట. ఇప్పుడొకటౌన్సు పుచ్చుకో."

శకుంతల మందుసీసా తీసుకుని "తాగుతాలే" అన్నది.

"ఇప్పుడుతాగు!"

శకుంతల బలవంతంగా గంటసేపు అనుమానించి చివరకు మందుతాగింది.

రామమూర్తి రంగారావుదగ్గిరికి వచ్చేడు.

"ఏమన్నారు చలపతిగారు?" అన్నాడు రంగారావు.

"చలపతిగారూ లేదూ, ఏమీలేదూ" అన్నాడు రామమూర్తి నవ్వి.

"మందు?"

"నాదే"

"పనిచేస్తుందా బాగా?"

"మందుమంచిదేలే. కాని నెలరోజులైనా తాగాలి"

"అంతవరకూ బాధపడుతూంటుందా?"

"పదిహేను ఇరవైరోజులు"

"చచ్చేం!"

"ఆమాత్రంలేకుండానా?"

"నే నదిపడేబాధ చూడలేనుమా"

"చూడు. ఈ బలహీనత ఉండరాదు. ప్రతివాడు తప్పనిసరిగా కొంత డాక్టరీ చదవాలని నా అభిప్రాయం. అప్పుడు నువ్విలాఅనవు!"

"నీసంస్కరణ అలాఉండనీ. అది పడేబాధలో ఒకపాలు నటన. అదైనా లేకుండాచేస్తూ. అనటన, పాపం, కావాలనికాదు. బొత్తిగా ఓర్చుకోలేదు. ఇలాంటివి చిన్నతనంనించీపస్తాయి."

రామమూర్తి కొంతసేపు ఆలోచించేడు.

"నేను నీకు చేస్తూన్న సహాయానికి సలహాకూ వందరూపాయలుఫీజు పుచ్చుకోవచ్చును. ఉపాయం చెబుతా వినూ."

* * * *

రామమూర్తీ, రంగారావూ భోజనంచేశారు. శకుంతల రామమూర్తి సలహాప్రకారం కొద్దిగాభోజనం చేసింది. మామూలుప్రకారం గుండెలోపోటు సన్నగా ప్రారంభమయింది. రంగారావుకు తాంబూలంఇచ్చి మరీ అంట్లు శుభ్రంచేద్దామని శకుంతల ఆకులూ, పక్కలూ పట్టుకునివచ్చింది.

రంగారావును చూడగానే ఆమెగుండె జల్లుమన్నది. అతను మంచంమీద అటూ ఇటూ పొర్లుతున్నాడు. అతనిముఖం వికారంగా మారిపోయింది.

శకుంతల భయంతోవచ్చి రంగారావుమంచంపక్కన మోకరించి "ఏమిటి?" అన్నది గొంతుచలిస్తూ.

"ఏమీలేదు" అన్నాడు రంగారావు మామూలుగా ఉండాలని ప్రయత్నిస్తూ.

"చెప్పరూ?" అన్నది శకుంతల భర్తచెయ్యిపట్టుకుని.

"గుండెలో బరువుగా ఉన్నది." అన్నాడు రంగారావు బలవంతంగా మాట్లాడుతూ.

"మీక్కూడానా?"

పదినిమిషాల్లో రంగారావు మామూలుస్థితికి వచ్చేడు. అతను మంచంలోలేచికూర్చుంటూ "డాక్టరు దగ్గిరికి వెళ్లివస్తా నిప్పుడే!" అన్నాడు.

"మీరు కాస్సేపు పడుకోండి. మా అన్నయ్య వెళ్లివస్తాడు."

"డాక్టరు పరీక్షచేస్తాడు"

"కొంచెంసేపు ఉండి పోదురుగాని"

ఆ సాయంత్రం రంగారావు సీసాతో మందు తెచ్చుకున్నాడు.

* * * *

"నామందులాలేదే?" అన్నది శకుంతల.

"నా ఊపిరితిత్తులుకూడా సరిగాలేవని ఇంకేదో మందిచ్చేడు. నేనీ మందు తాగలేనుమా."

"ఎప్పుడెప్పుడు తాగమన్నాడు డాక్టరు?"

"ఉదయం సాయంత్రం ఆరుగంటలకు"

* * * *

ఆరుగంటలకు శకుంతల టొన్నుగ్లాసులో రంగారావుమందు పోసుకొచ్చింది.

"ఏమిటది?" అన్నాడు రంగారావు అనుమానంతో.

"మీమందు" "తాగుతాలే" "ఇప్పుడుతాగండి"

"ఈపూట బాధగాలేదులే. ఈసారి బాధవస్తే తాగుతాలెస్తూ."

"కాదు, నేనుకూడా తాగుతానుగా. నన్ను చంపుకున్నట్టే తాగకపోతే."

రంగారావు మందు తాగేడు. శకుంతలా తాగింది.

ప్రతిపూటా రంగారావుకు భోజనానంతరం గుండెలో పోటువస్తూనేఉంది. శకుంతల ఆతనిబాధతో తనబాధ మరిచిపోతోంది. అతన్ని మందుతాగించటానికి తనుకూడా శ్రద్ధగామందుతాగుతోంది. రంగారావు ఏపూటకాపూట చాలా మొండితనం చేసేవాడు. ఇరవైరోజులు గడిచింది.

"నాకీపూట నొప్పిరాలేదు సుమండీ!" అన్నది శకుంతల.

రంగారావు కనుబొమలు ముడేసి గుండెలు రుద్దుతూ "నాకూ ఎక్కువబాధగాలేదు. ఇకమందు మానేస్తాను" అన్నాడు.

"వద్దు! వద్దు!" క్రమంగా శకుంతలరోగం, రంగారావు దొంగరోగం నయమయినాయి.

* * * *

చివరకు రంగారావు నిజంచెప్పేడు.

"అమ్మా! ఎంతవారూ!" అన్నది శకుంతల ఆశ్చర్యం నటిస్తూ. "ఇకమీమాట ఒక్కటైనావమ్మను."

"మంచిదే. కాని ఈ పూట తలపగలేస్తున్నది. ఎందుచేతనో?"

"పాపం! అమృతాంజనం పట్టుకురానా?"

రంగారావు నవ్వి శకుంతలను రెండుచేతులుపట్టుకొని దగ్గరికి లాక్కుని "పిచ్చిపిల్లా!" అంటూ ముద్దు పెట్టుకున్నాడు.

## చిన్నికృష్ణ!

ధరణి దేవకి గర్భంబుదాల్చినిన్ను
ధరను నునిచిన దాదిగా, కరములందు
వెన్నముద్దలుదొంగిలి వేడ్కతోడ
గొల్లపిల్లలతోఁగూడి చల్లగాను
చిన్నబొజ్జనునింపెడు పిన్నబాల!
సేవఁజేయుదు రారమ్ము చిన్నికృష్ణ!
బాలురందరనోడించి బాగుమీఱ
నాటలందున నేగెల్చితంచునిలువ

యే లేశ్వరపు వేంకటకృష్ణమూర్తిగారు

పల్లవాంచితమృదులసత్ పంకజంబు
లనఁగనొప్పెడు పాదంబులపుడు నీకు
యెంతనొచ్చెనో! గోపాల! యెవరికెఱుక?
సేవఁజేయుదు రారమ్ము చిన్నికృష్ణ!
చేతులారఁగ నిన్ బూజసేతునేని
పరమపదమునుజేఁబట్టవచ్చునంచుఁ
జెప్పుదురుపెద్దలిలగాన జిద్విలాస!
సేవఁజేయుదు రారమ్ము చిన్నికృష్ణ!